సాక్షి ఏలూరు

గురువారం । 27 । మార్చి । 2025



కొల్లేరు.. దారి చూస్తే బేజారు

కొల్లేరు లంక గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నా నాయకుల్లో చలనం లేదు. 8లో ▸



టీడీపీ నేతల ఆగడాలపై ఫిర్యాదు

టీడీపీ నేతలు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని.. వేరే ప్రాంతాలకు బదిలీ చేయమంటూ సచివాలయ కార్యదర్శులు మొర పెట్టుకుంటున్నారు. 8లో ▸



న్యూస్‌రీల్

కోడిగూడెంలో పారిశుద్ధ్య పనులు



ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో పొదలు తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: మండలంలోని కోడిగూడెం గ్రామంలో పారిశుద్ధ్య పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 24న సాక్షి దినపత్రికలో 'కోడిగూడెంలో సమస్యల తిష్ట' శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. స్థానిక ఎస్సీ కాలనీలో మురుగుతో నిండిన డ్రైనేజీలను, బోదెలను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లుతున్నారు. మంగలి పుంత వీధి రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పొదలను తొలగిస్తున్నారు. బోదెల్లోని తూరల్లో పేరుకున్న చెత్త, చెదారాన్ని తొలగించి, దిగువ ప్రాంతానికి మురుగు పారేలా చర్యలు చేపడుతున్నారు. వీధి లైట్లు లేని ప్రాంతాల్లో లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు.

'పది' పరీక్షలకు 23,616 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న 10వ తరగతి పరీక్షల్లో బుధవారం భౌతిక శాస్త్రం పరీక్షకు మొత్తం 23,616 మంది హాజరయ్యారు. వారిలో 23,098 మంది రెగ్యులర్ విద్యార్థులకు 22,536 మంది హాజరయ్యారు. ఒకసారి అనుత్తీర్ణులైన వారిలో 1313 మంది విద్యార్థులకు 1080 మంది హాజరు కాగా 233 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా పరిశీలకుడు 5 కేంద్రాల్లో, ప్రాంతీయ పాఠశాలల విద్య సంయుక్త సంచాలకుడు 6 కేంద్రాల్లో జిల్లా విద్యాశాఖాధికారి 5 కేంద్రాల్లో, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 3 కేంద్రాల్లో, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 21 కేంద్రాల్లో తనిఖీ చేశారు. దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షల్లో బుధవారం సైన్స్ పరీక్షకు మొత్తం 638 మంది విద్యార్థులకు 537 మంది హాజరు కాగా 101 మంది గైర్హాజరయ్యారు.

డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తులు



సూచనలిస్తున్న ఆర్టీఓ కృష్ణారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ఏర్పాట్ల నిమిత్తం దరఖాస్తుల కోసం కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ జనవరి 15న నోటిఫికేషన్ విడుదల చేసిందని ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం డీటీసీ కార్యాలయములో ఆర్టీసీ, వాహన డీలర్లు, డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యంతో ఆర్టీవో కృష్ణారావు సమావేశం ఏర్పాటు చేసి సవరించిన పథకాల మార్గదర్శకాలను వారికి వివరించారు. డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను జిల్లాలో ఏర్పాటు చేసుకోవడానికి సుమారుగా 2 ఎకరాల స్థలాన్ని చూపాలని, 85 శాతం ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. జనాభా ప్రాతిపదికన జిల్లాలో 10 లక్షల జనాభాకు ఒక సెంటర్ కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మరిన్ని వివరాలకు డీటీసీ షేక్ కరీంను సంప్రదించాలని తెలిపారు.

లోకాయుక్త విచారణ



విచారణ నిర్వహిస్తున్న లోకాయుక్త బృందం

జంగారెడ్డిగూడెం: మండలంలోని పంగిడిగూడెంలో లోకాయుక్త బృందం విచారణ చేపట్టింది. పంట కాలువ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో బుధవారం లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పి.వెంకటరామిరెడ్డి బృందంతో కలిసి విచారణ నిర్వహించారు. పంగిడిగూడెం పంట కాలువ ఆక్రమణలపై గ్రామానికి చెందిన జి.ఆశీర్వాదం లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించామన్నారు. నివేదికను లోకాయుక్తకు సమర్పిస్తామని వెంకటరామిరెడ్డి తెలిపారు. డీటీ కె.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్థానిక పోరు

- అత్తిలి, యలమంచిలి ఎంపీపీ పదవులకు ఎన్నిక
- ఏలూరు జిల్లాలో 10 ఉప సర్పంచులు, పశ్చిమగోదావరిలో 15 ఉప సర్పంచులకు ఎన్నిక
- అత్తిలి, యలమంచిలిలో టీడీపీ కుట్ర రాజకీయాలు
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు ప్రలోభాలే టార్గెట్‌గా రాజకీయం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పల్లె పోరుకు తెరలేచింది... జెంటిల్‌మెన్ ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న కొందరు సభ్యులు రాజీనామాతో ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 21న నోటిఫికేషన్ జారీ చేసి 27న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నిక పూర్తి చేయాలని ఆదేశించడంతో సందడికి తెరలేచింది. ఏలూరు జిల్లాలో 10 ఉప సర్పంచులు, పశ్చిమగోదావరి జిల్లాలో 15 ఉప సర్పంచులు, అత్తిలి, యలమంచిలిలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల పదవులకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి.

అధికార పార్టీ బెదిరింపులు

పంచాయతీల్లో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీల్లో 80 శాతానికిపైగా వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులే గెలుపొందారు. ఈ పరిణామాల క్రమంలో అత్తిలి, యలమంచిలి ఎంపీపీ ఎన్నికలు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా మారాయి. పార్టీల ప్రాతిపదికన జరిగే ఎన్నిక కావడంతో అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతుంది. అత్తిలి, యలమంచిలిలో ఎంపీటీసీలపై బెదిరింపుల పర్వానికి దిగింది. ఎక్కువ మంది ఎంపీటీసీలు లొంగకపోవడంతో వారి వ్యక్తిగత వ్యాపారాలపై దాడులకు దిగి జిల్లాలో చిల్లర రాజకీయాలకు తెరదీశారు. ఇలాంటి పరిణామాల క్రమంలోని అత్తిలి, యలమంచిలి ఎంపీటీసీలు పూర్తిగా వైఎస్సార్‌సీపీతోనే ఉండటంతో పాటు పార్టీ ఎంపీటీసీనే ఎంపీపీగా ఎన్నుకోనున్నారు.

ఎన్నికలు జరిగే స్థానాలివే..

పశ్చిమగోదావరి జిల్లాలో యలమంచిలి, అత్తిలి ఎంపీపీ స్థానాలతో పాటు నర్సాపురం మండలం మల్లవరం, గొంది, భీమవరం మండలం గొల్లవాని తిప్ప, గుట్లపాడు, ఎల్‌వీఎన్ పురం, తుందుర్రు, బేతపూడి, అత్తిలి మండలం కేఎస్ గట్టు, మొగల్తూరు మండలం కేపీ పాలెం సౌత్, పేరుపాలెం సౌత్, పాలకొల్లు మండలం అగర్తిపాడు, గోరింటాడ, ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం, వీరవాసరం మండలంలో పెరికేపాలెం, యలమంచిలి మండలంలో అబ్బిరాజుపాలెం, ఇరగవరం మండలంలోని కొత్తపాడు, పాలకోడేరు మండలంలో గొరగనమూడి పంచాయతీల్లో ఉపసర్పంచ్‌లు, ఉప ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఏలూరు జిల్లాలో ఏలూరు రూరల్, కైకలూరు వైస్ ఎంపీపీ పదవులతో పాటు దెందులూరు మండలంలోని దెందులూరు, పెదవేగి మండలంలో కొండలరావుపాలెం, రామశింగవరం, ముదినేపల్లి మండలంలో పొద్దువాక, చింతలపూడి మండలం రేచర్ల, మండవల్లి మండలంలో ముదుతాళ్ళపూడి, లోకుమూడి, నిడమర్రు మండలం ఎనికేపల్లి, కలిదిండి మండలంలో భాస్కరరావుపేట, కొయ్యలగూడెం మండలంలో అచ్యుతాపురం ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

స్థానిక ఎన్నికల్లో రక్షణ కల్పించాలి



ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రాన్ని చూపుతున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, ఏలూరు ఇన్‌చార్జ్ జేపీ

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కైకలూరు, ఏలూరు రూరల్ మండలాల్లో గురువారం జరిగే వైస్ ఎంపీపీ ఎన్నికకు పోలీసుల రక్షణ కల్పించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుధవారం ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ కలిగిన వైఎస్సార్‌సీపీ ఎంపీపీలను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేయడానికి అధికార కూటమి ప్రతినిధులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దౌర్జన్యాలు జరగకుండా పోలీస్ రక్షణ అవసరమని అన్నారు. ఏలూరు అసెంబ్లీ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, సిటీ అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయి సుధీర్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి భాస్కర్ల బాచి, బీసీ సెల్ టౌన్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, సిటీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి తదితరులు పాల్గొన్నారు.

గేట్‌లో ర్యాంకులు గర్వకారణం

ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్



గేట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏఓ లక్ష్మణరావు

నూజివీడు: నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు దాదాపు 200 మంది గేట్–2025 లో మంచి ర్యాంకులు సాధించడం ఆర్జీయూకేటీకి గర్వకారణమని నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. గేట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బుధవారం స్థానిక ట్రిపుల్‌ఐటీలో అభినందన సభ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతిభతో పట్టుదలతో ముందుకు సాగితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. గేట్ 2026లో మరిన్ని ర్యాంకులు సాధించడం ద్వారా ఆర్జీయూకేటీకి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ఇన్‌చార్జి రామకృష్ణ మాట్లాడుతూ గేట్ టెస్ట్ సిరీస్‌లను ఆర్జీయూకేటీ విద్యార్థులకు అందించడం వల్ల ర్యాంకులు సాధించడంలో ఎంతగానో ఉపయగపడ్డాయన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ డీన్ శ్రావణి, డీన్ అకడమిక్స్ సాధు చిరంజీవి, ఈఐటీపీ డీన్ పీ శ్యామ్, ఏఓ బీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27న రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహించ తలపెట్టిన ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని అన్ని ముస్లిం సంఘాలు బహిష్కరిస్తున్నాయని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని చూస్తున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థించడాన్ని ముస్లిం సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబుకు ముస్లింల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాష్ట్రంలోని ముస్లింల మనోభావాలను గౌరవించి అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. లేని పక్షంలో చంద్రబాబు రాష్ట్రంలో ముస్లిం వ్యతిరేకిగా ముద్రపడతారని స్పష్టం చేశారు. ఇప్పటికే ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఇఫ్తార్ విందును బహిష్కరించాలని ఇచ్చిన పిలుపును అన్ని ముస్లిం సంఘాలూ స్వీకరించాయని తెలిపారు.

అంతా ఏకపక్షమే

- సాదాసీదాగా ఏలూరు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశాలు
- అధికారం మాది.. ఇష్టం లేకపోతే వెళ్లిపోండి అంటూ టీడీపీ నేత దబాయింపు
- 2025–26కు రూ.211.34 కోట్లతో బడ్జెట్ ఆమోదం



సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శ్రీనివాస్, టీడీపీ సభ్యుడు వెంకటరత్నం మధ్య వాగ్వాదం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశాలు సాదాసీదాగా జరిగాయి. ముందు ప్రకటించిన షెడ్యూల్ కన్నా గంట ఆలస్యంగా ప్రారంభమైనా.. తొందరగా ముగించేశారు. ప్రతిపక్ష సభ్యులు పెద్దగా హాజరు కాకపోవడంతో అధికార పార్టీ నాయకులు వారి ఇష్టమే అన్నట్లు చేసుకుపోయారు. జీటీఎస్(గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్స్) రద్దు అంశంపై చర్చలో ప్రశ్నించిన మాజీ డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్‌ను టీడీపీ కో–ఆప్షన్ సభ్యుడు చోడే వెంకటరత్నం అడ్డుకున్నారు. అధికారం మాది.. అంతా మా ఇష్టం.. ఉంటే ఉండండి లేకపోతే కౌన్సిల్ హాలు నుంచి బయటకు వెళ్లండి అని చెప్పడంతో అవాక్కయ్యారు. ఇదంతా చూస్తున్న కార్పొరేషన్ కమిషనర్ భాను ప్రతాప్, ఇతర అధికారులు కనీసం దాన్ని ఖండించే ప్రయత్నం చేయలేదు. మొత్తంగా 2025–26 అంచనా బడ్జెట్ రూ.211.34తో ఆమోదించారు. దీనిలో ఖర్చు రూ.199.52 కోట్లుగా అంచనా వేయగా మిగులు బడ్జెట్ రూ.11.82 కోట్లుగా ఆమోదించారు.

గంట ఆలస్యంగా ప్రారంభం

బడ్జెట్ సమావేశం ముందు ప్రకటించిన విధంగా ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా ఉదయం 11.30 గంటలకు మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. సమావేశంలో 2025–26 అంచనా బడ్జెట్‌ను రూ.211.34 కోట్లతో ఆమోదించారు.

8 అంశాలపై చర్చ : కౌన్సిల్ సర్వ సాధారణ సమావేశంలో 8 అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో గత 15వ ఆర్థిక సంఘం నిధులతో 2020–21లో ప్రారంభించిన మూడు జీటీఎస్ నిర్మాణాలను నిలుపుదల చేసి వాటిలో మిగిలిన నిధులతో రోడ్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ క్రమంలోనే జీటీఎస్ విధానం విధి విధానాలను తెలియజేయాలంటూ వైఎస్సార్సీపీ కార్పొరేటర్ గుడిదేశి శ్రీనివాసరావు కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కో–ఆప్షన్ సభ్యుడు చోడే వెంకటరత్నం జోక్యం చేసుకుంటూ ఏకపక్షంగా మాట్లాడారు.

నీటిని పొదుపుగా వాడాలి : ఈ వేసవిలో నగరంలో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం పొంచి ఉన్నందున ప్రతి ఒక్కరూ తాగునీటిని పొదుపుగా వినియోగించాలని మేయర్ కోరారు. దెందులూరు ఎస్ఎస్ ట్యాంక్ కెపాసిటీ 16.2 మీటర్లు కాగా 10.3 మీటర్లుగా నీటి మట్టం ఉందన్నారు. గోదావరి కాలువకు శివారున ఏలూరుకు తాగునీరు అందించే చెరువు ఉండటం వల్ల కాలువలో పూర్తి స్థాయిలో నీటిమట్టం లేకపోవడంతో చెరువును పూర్తి స్థాయిలో నింపేందుకు ఇబ్బంది ఏర్పడిందన్నారు. అయినా కార్పొరేషన్ పరిధిలో శాయశక్తులా చెరువును నింపేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

పగడాల మృతిపై సరైన దర్యాప్తు జరపాలి



ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు, దళిత జేఏసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): బ్రదర్ పగడాల ప్రవీణ్‌ది ముమ్మాటికి హత్యే అని దాన్ని యాక్సిడెంట్‌గా చిత్రీకరించడం దుర్మార్గమని, ఆయన మిస్టరీ మర్డర్‌పై సరైన విచారణ జరిపి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేసారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో కొవ్వొత్తులతో బుధవారం రాత్రి నిరసన వ్యక్తం చేసారు. వరప్రసాదరావు మాట్లాడుతూ కొవ్వూరు టోల్‌గేట్ దాటేటప్పుడు సీసీ ఫుటేజ్‌లో బ్రదర్ పగడాల ప్రవీణ్ బాగానే ఉన్నారని టోల్‌గేట్ దాటిన తర్వాత యాక్సిడెంట్ చిత్రీకరించడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే దీనిపై ముఖ్యమంత్రి స్పందించి దర్యాప్తును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల క్రైస్తవులు, దళితులు, చర్చిలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

వాహన పన్ను వెంటనే చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రవాణా వాహనాలకు చెల్లించాల్సిన వాహన పన్ను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. వాహన తనిఖీ అధికారులను బృందాలుగా ఏర్పాటుచేసి ప్రత్యేక తనిఖీల ద్వారా పన్ను చెల్లించని వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో పన్ను చెల్లించని 104 రవాణా వాహనాలపై కేసులు నమోదు చేసి రూ. 6.11 లక్షల అపరాధ రుసుము విధించామని, 23 వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేస్తే చట్ట రీత్యా 200 శాతం పెనాల్టీ విధిస్తామని, స్వచ్ఛందంగా 50 శాతం పెనాల్టీతో త్రైమాసిక పన్నును చెల్లించవచ్చునన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షకు 47 మంది హాజరు

భీమవరం: డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షకు 47 మంది హాజరయ్యారని పరీక్షల పర్యవేక్షకుడు సుందర్‌కుమార్ చెప్పారు. ఉదయం పరీక్షకు 100 మందికి 53 మంది గైర్హాజరయ్యారని సుందర్‌కుమార్ తెలిపారు.

నేడు పోలవరానికి సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ఏలూరు (మెట్రో)/పోలవరం రూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లిలో బయలుదేరి 10.45 గంటలకు పోలవరంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రాజెక్టు వ్యూ పాయింట్ వద్దకు చేరుకుని ప్రాజెక్టు పనులు పరిశీలిస్తారు. అనంతరం అప్పర్ కాఫర్ డ్యామ్, గ్యాప్–1, డయాఫ్రమ్ వాల్, వైబ్రో కంపెక్షన్ తదితర పనులను పరిశీలించి వీవీపీ గ్యాలరీలో ఫోటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు. అనంతరం 3 గంటల వరకు నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష చేస్తారు. అనంతరం 3.10 గంటలకు హెలీప్యాడ్ నుంచి బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు. రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కుమార్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిలు పోలవరంలో సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ, ఎస్పీ

ఉపాధ్యాయులు, లెక్చరర్ల సమస్యలపై ప్రస్తావన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రాష్ట్ర శాసన మండలిలో ప్రస్తావించినట్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి తెలిపారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకన శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపించిన లెక్చరర్లకు తొలుత కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్, జూనియర్ లెక్చరర్లకు ప్రిన్స్‌పాల్ పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దామని వివరించారు. కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని, ప్రైవేట్, కళాశాలలు, పాఠశాలల్లో పని చేస్తున్న అధ్యాపక సిబ్బందికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్ కొత్త కరికులంలో తెలుగును ఆప్షనల్ సబ్జెక్టుగా కాక తప్పనిసరి సబ్జెక్ట్ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తెలుగు అధ్యాపకుల సంఘ నాయకులు గోపీమూర్తికి వినతిపత్రం సమర్పించారు. వారిలో సంఘ ప్రతినిధులు బీవీ శ్రీనివాస్, భక్త హనుమాన్, రాజకృష్ణ, ఏవీ రాజశేఖర్, ఖాసిం పీరా, ఎం.పేర్రాజు తదితరులున్నారు.



ఇంటర్ మూల్యాంకన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

పరిశ్రమల స్థాపనకు 4 వేల ఎకరాల భూములు

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు 4 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టర్ల సదస్సు రెండో రోజున ముఖ్యమంత్రికి జిల్లా ప్రగతి గురించి వివరించారు. పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు స్థాపించడానికి ముందుకొచ్చే వారి కోసం భూములు సిద్ధంగా ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగంలో, పర్యాటక రంగంలో ఏలూరు జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా జీడీపీని 15 శాతం లక్ష్యంగా నిర్ణయించామని, దీనిలో వ్యవసాయం నుంచి 67 శాతం, పారిశ్రామికంగా 8 శాతం, సేవారంగాలలో 25 శాతం అభివృద్ధి ద్వారా సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వా, ఉద్యానవన పంటల నుంచి అభివృద్ధికి మంచి అవకాశాలున్నాయన్నారు. పామాయిల్ విస్తృతంగా సాగుచేయడానికి ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. తలసరి ఆదాయం రూ.4 లక్షలు లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. జిల్లాలో మామిడి రైతులు ఎక్కువగా ఉన్నారని, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించే ప్రధానమంత్రి యోగా అవార్డుకు ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, విస్తరణ, అవగాహనకు కృషి చేసిన వ్యక్తులు లేదా సంస్థలు దరఖాస్తుకు అర్హులని వెల్లడించారు. మార్చి 31లోపు దరకాస్తులు అందజేయాలని సూచించారు.

క్లుప్తంగా

సందేశాత్మకంగా అఖిల భారత స్థాయి నాటిక పోటీలు



నాటికలోని సన్నివేశం

వీరవాసరం: వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి నాటిక పోటీల 11వ వార్షికోత్సవ ప్రదర్శనలు సందేశాత్మకంగా కొనసాగుతున్నాయి. మొదటి ప్రదర్శనగా సౌజన్య కళా స్రవంతి ఉత్తరాంధ్ర వారి 'దేవరాగం' నాటిక ప్రదర్శనమైంది. రచన దర్శకత్వం కేకేఎల్ స్వామి వహించారు. ద్వితీయ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి ఉక్కునగరం విశాఖ వారి 'అసత్యం' నాటిక ప్రదర్శించగా రచన పిన్నమనేని మృత్యుంజయ రావు, దర్శకత్వం బాలాజీ నాయక్ వహించారు. నాటక ప్రదర్శనలు ఎంతో ఆసక్తిగా, సందేశాత్మంగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు గుండా రామకృష్ణ తెలియజేశారు.

పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



పెద్దింట్లమ్మ దేవస్థానంలో హుండీ లెక్కింపు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం హుండీల లెక్కింపు ఆలయంలో బుధవారం జరిగింది. 43 రోజులకు గాను రూ.15,25,615 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు చెప్పారు. అలాగే గోకర్ణపురం గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో 11 నెలల 8 రోజులకు గాను భక్తులు సమర్పించిన హుండీల కానుకలను లెక్కించగా రూ.26,519 ఆదాయం వచ్చిందన్నారు. దేవాదాయశాఖ గుడివాడ తనిఖీ అధికారి సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మద్ది క్షేత్రంలో హుండీ లెక్కింపు

జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ ఈవో మానికల రాంబాబు పర్యవేక్షణలో కేవీబీ బ్యాంక్ సిబ్బంది హుండీలను తెరిచి లెక్కింపు నిర్వహించారు. మొత్తం 97 రోజులకు గాను ఆలయానికి హుండీ ద్వారా రూ.50,84,145, అన్నదానం హుండీ ద్వారా రూ.1,02,700, వెరశి మొత్తం 51,86,845 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు.

శ్రీవారికి 4.32 ఎకరాల పొలం విరాళం



దాత అందించిన పొలం రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న ఆలయ ఈఓ మూర్తి (ఎడమ వైపు నుంచి రెండో వ్యక్తి దాత కోటేశ్వరరావు)

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి హైదరాబాద్‌కు చెందిన కాకుమాను కోటేశ్వరరావు అనే భక్తుడు 4.32 ఎకరాల (కోకో, కొబ్బరి) పొలాన్ని బుధవారం విరాళంగా అందజేశారు. ద్వారకాతిరుమల మండలం సత్తెన్నగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఆర్ఎస్ నెంబర్ 38/1లో ఉన్న ఈ పొలాన్ని శ్రీవారి పేరున భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి, ఆ పత్రాలను ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణ మూర్తికి అందజేశారు. దాతకు ఈఓ చినవెంకన్న చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, లీగల్ సెక్షన్ ఆర్.హనుమంతాచార్యులు ఉన్నారు.









కొల్లేరు గ్రామాల ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా ఉన్న దృశ్యం

కొల్లేరు.. దారి చూస్తే బేజారు

సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉంటాయని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా క్షేత్రస్థాయిలో మాత్రం పనులు పూర్తిచేయడంలో విఫలమైంది. పండుగ దాటి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ కొల్లేరులోని లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టలేదు. ఏలూరు మండలం మాధవాపురం నుంచి కొల్లేరు గ్రామం గుడివాకలంక వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద పెద్ద గోతుల్లో జారిపడి తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా నాయకుల్లో చలనం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి?

ఏలూరు టౌన్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి స్టంట్స్ వేసి ఇంటికి పంపిన 24 గంటల్లోనే మృతి చెందడంతో మృతుని బంధువులు బుధవారం ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు ఏలూరు వన్‌టౌన్ పడమరవీధికి చెందిన ఘంటా రామకృష్ణ (45)ను వైద్యం నిమిత్తం బంధువులు ఏలూరు ఆర్ఆర్‌పేటలోని రితేష్ హార్ట్‌కేర్ హాస్పిటల్‌లో చూపించగా అక్కడ వైద్యులు స్టంట్స్ వేయాలని చెప్పడంతో నాలుగు రోజుల క్రితం హాస్పిటల్‌లో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స అందించి మంగళవారం డిశ్చార్జ్ చేశారు. బుధవారం ఉదయం రామకృష్ణకు ఊపిరి తీసుకోవడం కష్టం కాగా బంధువులు తిరిగి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే రామకృష్ణ అపస్మారక స్థితిలోకి వెళ్లగా వైద్యులు కొద్దిసేపు చికిత్స అందించిన అనంతరం మృతిచెందారు. దీంతో బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆస్పత్రి యాజమాన్యం సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. అయితే ముందుగానే రోగి ఆరోగ్య పరిస్థితి బాగోలేదనీ, 50 శాతం మాత్రమే బతికే అవకాశం ఉందని చెప్పినట్టు హాస్పిటల్ వర్గాలు చెబుతున్నాయి. రామకృష్ణకు ఆరోగ్యం బాగుందని చెబితేనే డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపామని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. దీనిపై పూర్తి వివరణకు హాస్పిటల్ యాజమాన్యాన్ని సంప్రదించగా ఎవరూ అందుబాటులో లేరు.



హాస్పిటల్ యాజమాన్యాన్ని నిలదీస్తున్న మృతుని బంధువులు

టీడీపీ నేతల ఆగడాలపై ఫిర్యాదు

- ఎంపీడీఓకి ఫిర్యాదు చేసిన సచివాలయ ఉద్యోగులు
- విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడుతున్నారని ఆవేదన
- తమను బదిలీ చేయాలంటూ వినతి



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న ఎ.గోకవరం సచివాలయ ఉద్యోగులు

ఉంగుటూరు: టీడీపీ నేతలు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని.. ఇక్కడ తాము పనిచేయలేమని.. వేరే ప్రాంతాలకు బదిలీ చేయండి సార్ అంటూ సచివాలయ కార్యదర్శులు ఎంపీడీఓకు మొర పెట్టుకున్నారు. ఎ.గోకవరం సచివాలయ కార్యదర్శి కుసుమ, ఇతర ఉద్యోగులు బుధవారం మూకుమ్మడిగా ఎంపీడీఓ మనోజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలో టీడీపీ నాయకులు తమను అనవసరంగా దుర్భాషలాడుతున్నారని, కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నారని కార్యదర్శి కుసుమ ఎంపీడీఓ వద్ద కన్నీరు పెట్టుకున్నారు. ఇదే గ్రామంలో తాము ఉద్యోగం చేయాలంటే పోలీసులు సహాయం ఏర్పాటు చేయాలని లేదంటే తమని వేరే గ్రామానికి బదిలీ చేయాలని కోరారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానికి ఎంపీడీఓ వారికి హామీ ఇచ్చారు. కార్యదర్శిని ఎంపీడీఓ కార్యాలయంలో అదనపు వర్క్ చేయమని ఆదేశించగా, మిగిలిన ఉద్యోగులు విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గోకవరం పంచాయతీలో విధులు నిర్వర్తించలేమంటూ ఇప్పటికీ నలుగురు కార్యదర్శులు వేరే చోటకు బదిలీపై వెళ్లిపోయారంటే పరిస్థితికి అద్దం పడుతోంది. గ్రామ సర్పంచ్ మిద్దే సత్యవతి వైఎస్సార్‌సీపీ సానుభూతి పరురాలు కావడంతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. సర్పంచ్‌కు సహకరించే ఉద్యోగులపై ప్రతాపం చూపుతున్నారు. కూటమి నేతల వేధింపులపై ఉంగుటూరు పర్యటనకు వచ్చిన సీఈఓ భీమేశ్వరరావు దృష్టికి ఎంపీడీఓ తీసుకువెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన అన్నారు.

అనుమానాస్పద స్థితిలో అటెండర్ మృతి



పోలారావు (ఫైల్)

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న నూగంటి పోలారావు (58) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలివి. స్థానిక బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్న నూగంటి పోలారావు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విధులకు వెళ్లడం లేదు. భార్య చనిపోవడం, పిల్లలు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో ఒక్కడే ఒంటరిగా ఉంటున్నాడు. బుధవారం పోలారావు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని చుట్టుపక్కల వారు వీఆర్వో శ్రీనుబాబుకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన వీఆర్వో కుళ్లిన దశలో ఉన్న పోలారావు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలారావు మృతదేహం వద్ద పురుగుమందు, కూల్‌డ్రింక్ సీసా ఉంది. దీంతో పోలారావు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వీఆర్వో ఫిర్యాదుతో అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దర్శకుడు నవీన్‌కు పురస్కారం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన దర్శకుడు నవీన్ లొట్ల బుధవారం న్యూఢిల్లీలో జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. జాతీయ మానవ హక్కుల సంఘం నిర్వహణలో జరిగిన లఘుచిత్ర జాతీయ పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో నవీన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మహిళలపై దాడులు, సమాజ జోక్యం ఇతివృత్తంగా రూపొందించిన 'బి ఏ హ్యూమన్' లఘుచిత్రంకుగాను ఈ పురస్కారం అందుకున్నట్లు నవీన్ తెలిపారు.

ఖైదీలకు వైద్య సదుపాయాలు అందించాలి

ఏలూరు (టూటౌన్): ఖైదీలకు వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ (ఎఫ్ఏసీ) ఆధ్వర్యంలో రత్నప్రసాద్ బుధవారం ఏలూరులోని జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు పరిశుభ్రమైన నీరు, ఆహారం అందించాలని అధికారులకు సూచించారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా ఉచితంగా కేసులను వాదించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం అందుబాటులో ఉన్న ఖైదీల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి న్యాయ సహాయం అవసరమైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ప్రత్యక్షంగా గాని 08812 22455 లేదా 15100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చునన్నారు. జిల్లా జైలర్లు పాల్గొన్నారు.



జైల్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

వివాహిత ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: మండలంలోని చిన్నంవారి గూడెం గ్రామానికి చెందిన వీరగంటి తేజస్విని (23) ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్సై వై.మంగయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన ఏలేటి రాణి తన బంగారు వస్తువులు ఇంటి పక్కనే ఉన్న వీరగంటి తేజస్విని తీసిందని ఆరోపిస్తూ విషయాన్ని పెద్దల్లో పెట్టింది. తేజస్విని ఆ విషయాన్ని అంగీకరించి బంగారు వస్తువులను రాణికి ఇచ్చేసింది. అయితే అప్పటినుంచి తేజస్విని తీవ్ర మనోవేదనకు గురైంది. బుధవారం భర్త అనిల్‌కుమార్ కుమారుడిని తీసుకుని బయటకు వెళ్లడం.. అత్త, కుమార్తె ఇంటి వరండాలో ఉన్న సమయంలో తేజస్విని బెడ్‌రూమ్ లోకి వెళ్లి గడియపెట్టుకుంది. ఇంటికి వచ్చిన అనిల్ కుమార్ బెడ్‌రూమ్ గడియపెట్టి ఉండడంతో కిటికీలో నుంచి లోపలికి చూడగా అప్పటికే తేజస్విని చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడడాన్ని గుర్తించారు. తేజస్విని భర్త అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్



మాట్లాడుతున్న జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్

చింతలపూడి: ముస్లింల హక్కులను కాలరాయడానికి ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 29న ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు తరుపున విజయవాడలో నిర్వహించే ధర్నాకు ముస్లిం సమాజం యావత్తు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జామియ మస్జిద్‌లో ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా బిల్లును కేంద్రం ప్రవేశపెట్టిందని, ఈ బిల్లు ద్వారా ముస్లింల ఆర్థిక మూలాలు దెబ్బతింటాయని అన్నారు. ముస్లింల పూర్వీకులు ఇచ్చిన ఆస్తులను హరింపచేయడానికే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లును ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమాతే ఇస్లామీ హింద్ వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బిల్లు సవరణలు చేయడం కాకుండా పూర్తి బిల్లును ఉపసంహరించుకోవాలని జమాతే ఇస్లామి హింద్ డిమాండ్ చేస్తుందని అన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ఈనెల 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రభుత్వం అందించే ఇఫ్తార్ విందును ముస్లిం సమాజం బహిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రం ప్రవేశపెట్టే సవరణ బిల్లుకు వ్యతిరేకంగా గళం విప్పి ముస్లింల మనోభావాలను మత పరమైన హక్కులను కాపాడాలని కోరారు.